క్లుప్తంగా

వ్యవసాయ విద్యుత్ బిల్లుల చెల్లింపు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామ రైతులు బుధవారం వ్యవసాయ విద్యుత్ బిల్లులు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలోని 500 వ్యవసాయ మోటార్లకు సంబంధించిన రూ.2లక్షల 23 వేలు చెల్లించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్, ఎఫ్ఎం కమల్‌చంద్, లైన్‌మెన్లు ఎండీ యూసుఫ్, ప్రవీణ్, శ్రీనివాస్, రాజన్న, పవార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి మహిపాల్ నోట్‌పుస్తకాలు, పెన్నులు, పండ్లను బుధవారం పంపిణీ చేశారు. తన మనుమడు అభిక్ యువరాజ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి లక్ష్మి, హెచ్‌ఎం రాజేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయంపాలన



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి కింది తరగతుల వారికి పాఠ్యాంశాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు బుధవారం పంట పొలాల్లో క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా వరి నాట్లు వేసే విధానాన్ని పరిశీలించి నాట్లు వేశారు. క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలుగుతుందని కరస్పాండెంట్ నిషార్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



వర్ని(చందూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న సిరాజుద్దీన్‌ను పాఠశాల కమిటీ సభ్యులతోపాటు ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ దశాగౌడ్, ఎస్ఎంసీ సభ్యులు గణేశ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్‌ను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో ఇతరులకు ఇబ్బంది కలిగేలా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్‌ను తొలగించాలని చాదల సుదర్శన్ అనే వ్యక్తి బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్‌ను ఏర్పాటు చేయదల్చుకున్న వ్యక్తి 50 ఫీట్ల రోడ్డువైపు వేసుకుంటే ఇతరుల గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఉండవని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పిల్లర్‌ను తొలగించాలని కోరారు.

నేడు స్టూడెంట్స్ ఫెస్టివల్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్టూడెంట్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నిఖత్ కౌసర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టూడెంట్స్ ఫెస్టివల్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

అడుగడుగునా సమస్యలే!

- జ్యోతినగర్ వాసులకు తిప్పలు
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు



డ్రెయినేజీలు లేని కాలనీ



అసంపూర్తిగా మిగిలిన సీసీ రోడ్డు

మాక్లూర్: మండలంలోని ఢీకంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జ్యోతినగర్ (రామస్వామి క్యాంప్)లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 500 మంది జనాభా ఉన్న జ్యోతినగర్‌లో గ్రామ పంచాయతీ కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం నాలుగు రోడ్లకు మాత్రమే సీసీ వేశారని, అదికూడా సగం పనులు చేసి వదిలివేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా మట్టిరోడ్లకు డ్రెయినేజీల నిర్మాణం కూడా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నదని, నడవడం కూడా ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఈనెల 25న క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని, క్రిస్టియన్లు ఎక్కువ సంఖ్యలో ఉండే తమ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చిచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలను నిర్మించాలి



మా గ్రామంలో ప్రధానంగా డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు నిర్మించాలి. ఇంకా మిగిలి ఉన్న మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలి. రాత్రి వేళల్లో కాలి నడకన వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. సర్పంచ్ స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– ప్రమోద్, జ్యోతినగర్

చేయాల్సింది చేశాం

మా ఢీకంపల్లి గ్రామానికి అనుబంధంగా ఉన్న జ్యోతినగర్‌లో చేయాల్సిన అభివృద్ధి పనులు చేశారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మించాం. ఒక్కచోట కల్వర్టు కట్టాల్సి ఉండడంతో సీసీ రోడ్డును అక్కడి వరకే నిర్మించాం. త్వరలో అదికూడా పూర్తిగా నిర్మిస్తాం. జీతాలు లేక గ్రామపంచాయతీ సిబ్బంది విధుల్లోకి రావడం లేదు. దీంతో రోడ్లు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. క్రిస్మస్ రోజున శుభ్రం చేయిస్తాం.

– సాధుల్ సవిత, సర్పంచ్, ఢీకంపల్లి

మార్చి 3 నుంచి ఐక్యతామహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న వి ప్రభాకర్

ఆర్మూర్: కేంద్ర,రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, నిరంకుశ విధానాలపై ఎన్నో పోరాటాలను చేస్తున్న విప్లవ పార్టీ ఐక్యతా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకుడు వి ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ్ భవన్‌లో బుధవారం సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో సమసమాజం, నూతన ప్రజాస్వామిక సోషలిస్టు రాజ్యం కావాలనే ఆశయంతో పనిచేస్తున్న పార్టీ సీపీఐఎంఎల్ అని అన్నారు. ఆదివాసీ, దళిత, వెనుకబడిన, మైనారిటీ వర్గాలపై జరిగే దోపిడీ, అణిచివేతకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. మహాసభలు వచ్చే ఏడాది మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్రజలు, కార్మిక, రైతు, ఉద్యోగ, వ్యాపారస్తులు తమ శక్తి మేరకు ఆర్థిక తోడ్పాటునందించాలని కోరారు. సమావేశంలో ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి దేవారాం, డివిజన్ నాయకులు ఎం ముత్తెన్న, కిషన్, గంగన్న, రాజన్న, దుర్గా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లోలపు రజిని

రెంజల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ప్రగతి సాధించాలని ఎంపీపీ లోలపు రజిని, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం రెంజల్‌లోని రైతు వేదికలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి అవగాహన కల్పించారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పథకాలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ విజయ, ఇన్‌చార్జి ఏపీఎం భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలరాణి, రెంజల్ కెనరా బ్యాంకు మేనేజర్ సంతోష్, పశు వైద్యాధికారి విఠల్, ఏఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లాభదాయక వ్యాపారాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో మధుసూదన్

మాక్లూర్: తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు ఇచ్చే వ్యాపారాలను ఎంచుకోవాలని అదనపు డీఆర్డీవో మధుసూదన్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహిళా సంఘాల సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో బ్యాంకులకు తిరిగి చెల్లించాలన్నారు. ప్రస్తుత కాలంలో పిండి, మసాల, కారం, పసుపు గిర్నిలతోపాటు బేకరీలకు సంబంధించిన మిషనరీలను కొనుగోలు చేసి వ్యాపారాలను ప్రారంభించుకోవాలని సూచించారు. గ్రామాల్లో డిమాండ్ ఉన్న వస్తువులను అందుబాటులో ఉంచి వ్యాపారం చేసుకోవచ్చన్నారు. బ్యాంకులు సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో డీపీఎం శ్రీనివాస్, మండల ఏపీఎం అనిల్‌కుమార్, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అహింస, శాంతికి ప్రతీక క్రైస్తవం



కేక్ కట్‌చేస్తున్న ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్‌టౌన్(బోధన్): అహింస, శాంతికి ప్రతీక క్రైస్తవ మతమని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున బుధవారం పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాలులో క్రిస్మస్ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఉర్దూఘర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ మీదుగా కొనసాగింది. అనంతరం అప్నా ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవోతోపాటు ఏసీపీ కిరణ్‌కుమార్ కేక్‌కట్ చేశారు. సీఐ వీరయ్య, తహసీల్దార్లు గంగాధర్, శశికిరణ్, కమిటీ అధ్యక్షుడు అంతయ్య చౌదరి, పాస్టర్లు థామస్, విన్సెంట్, అనిల్‌కుమార్, ఏసుదాసు, దేవీదాస్, తిమోతీ, మాథ్యూస్, వినయ్ ప్రసాద్, కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, కిశోర్‌కుమార్, రవికుమార్, ఎడ్వర్డ్ ముల్లర్ పాల్గొన్నారు.

సామూహిక మండల మహాపడిపూజ



మహాపడిపూజలో పాల్గొన్న మాలధారులు

రుద్రూర్: అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి సామూహిక మండల మహాపడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి పూజ, అష్టోదశ సోపాన పూజలు, అభిషేకం చేశారు. అయ్యప్ప నామస్మరణతో సన్నిధానం మారుమోగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ట్రస్ట్ చైర్మన్ విఠల్‌రావుగుప్తా, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

పోచమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లి శివారులో ఉన్న మోట్ల పోచమ్మను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా కుటుంబ సభ్యులతో బుధవారం దర్శించుకున్నారు. తమ కుల దైవమైన అమ్మవారిని ప్రతి ఏడాది దర్శనం చేసుకుంటామని ఆయన తెలిపారు. తాను ఎన్నికల్లో గెలుపొందాలని అమ్మవారిని కోరుకున్నానని, మొక్కును తీర్చుకునేందుకు ప్రస్తుతం వచ్చినట్లు ఆయన తెలిపారు. ధన్‌పాల్ వెంట బీజేపీ నాయకు లు రమేశ్, సురేశ్, స్థానిక సర్పంచ్ సాయమ్మ, వీడీసీ సభ్యులు సుదర్శన్ రావు, బి సాయిలు, సంపత్‌రావు, సాగర్ రావు, ప్రమోద్ ఉన్నారు.

భగవద్గీతపై అవగాహన



నవీపేట(బోధన్): ఇందూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం భగవద్గీతపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఇంట్లో భగవద్గీత గ్రంథం ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా భగవద్గీత గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇందూర్ ఇస్కాన్ ప్రతినిధులు రామానంద రాయ గౌరదాస్, సునీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో పశు వైద్యశిబిరం



రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌లో వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 15 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. 14 పాడి పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 31 పశువులకు సాధారణ చికిత్స చేశారు. శిబిరంలో మండల పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి, వెటర్నరీ సిబ్బంది, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

సమసిన వివాదం

ఆర్మూర్‌టౌన్: వేల్పూర్ మండ కేంద్రంలోని ఈద్గా, దేవాలయం సమీపంలో నెలకొన్న భూ వివాదం సమసిపోయింది. కొద్ది రోజుల నుంచి ఈ అంశం వివాదాస్పదమైంది. కాగా ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో శ్రీనివాసులు, ఏసీపీ జగదీష్‌చందర్ ఇరువర్గాలను సముదాయించారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారుల సూచన మేరకు ఇరువర్గాలవారు అధికారుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకున్నారు. హద్దులు నిర్ణయించుకొని ఈద్గా ఆధునీకరణకు ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామపెద్దలు తెలిపారు. ఇరు వర్గాల నుంచి సంతకాలు తీసుకున్నారు. వీడీసీ పెద్దలు, మైనార్టీలు సభ్యులు పాల్గొన్నారు.



ఇరువర్గాలవారితో అధికారులు, పోలీసులు

ఎస్సీ, ఎస్టీ కేసులకు పరిష్కారం చూపాలి

- బోధన్ ఆర్డీవో రాజాగౌడ్



విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ డివిజన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సత్వర పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అధికారులను డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు వివరాలతోపాటు విచారణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలపై అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని, అత్యాచార కేసులు ఉంటే తక్షణమే బాధితులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల పరిష్కారానికి పోలీసు, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, సోషల్ వెల్ఫేర్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ కిరణ్‌కుమార్, తహసీల్దార్లు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు ధూప్‌సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరి నారులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి నారును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

బాల్కొండ: వరి నారు మడిలో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వరి నారు మడిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. చలి తీవ్రత కారణంగా పోషకాల లభ్యత తగ్గిపోయి వరినారు ఎర్రబడుతుంతని, ఎదుగుదల నిలిచిపోతుంలన్నారు. దీని నివారణకు 19:19:19 ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. యాసంగి సీజన్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జింకు లోపం ఏర్పడి ఆకులపై తుప్పు పట్టిన ఇటుక రంగు మచ్చలు ఏర్పాడుతాయని తెలిపారు. దీని నివారించేందుకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొగిపురుగు నివారణకు నారు తీసేవారం రోజుల ముందు ఎకరానికి సరిపడే నారుకు ఒక కిలో త్రీజీ కార్బోఫూరాన్ గుళికలు చల్లాలని సూచించారు. ఆయనవెంట రైతులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



దేవతల వేషధారణలో చిన్నారులు

రుద్రూర్ : మండలంలోని రాణంపల్లిలో దక్షిణముఖ సంజీవని ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. మొదటిరోజు శాంతిసూక్త పఠనం, గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, హోమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో దేవతామూర్తుల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారులు దేవతల వేషధారణలో అలరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి హంపీ పీఠాధిపతి విరుపాక్ష విద్యారణ్య భారతీస్వామి హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రవచనం చేశారు. కార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.40 లక్షల నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ రోజాలక్ష్మణ్ తెలిపారు.



భక్తులకు ప్రవచనం చెబుతున్న విద్యారణ్య భారతీస్వామి

రోడ్డుపై పారుతున్న మురికినీరు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణం స్వచ్ఛభారత్‌లో ముందుందని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆ మాటలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో మురికినీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ అధికారులు ఆ రోడ్డుమీదుగానే రాకపోకలు కొనసాగిస్తుంటారు. బస్టాండ్‌కు వెళ్లే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తున్నది. పట్టణవాసులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికినీరు రోడ్డుపై పారకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి



కమ్మర్‌పల్లి: సర్వే నంబర్ల వారీగా సాగవుతున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏఈఓలకు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ సూచించారు. మండలంలోని అమీర్‌నగర్, చౌట్‌పల్లిలో సాగవుతున్న యాసంగి పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. యాసంగి సీజన్‌లో ఎకరాకు 10 కిలోల చొప్పున నాణ్యమై జింక్ సల్ఫేట్ వినియోగించి, జింక్ లోపాన్ని నివారించాలని రైతులకు సూచించారు. ఏడీఏ మల్లయ్య, ఏఓ లావణ్య, ఏఈఓలు సాయిరాం, రాజ్, పద్మ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – హాయ్ నాన్న (తెలుగు)-10.30
అక్వామెన్ (ఇంగ్లీష్-3డీ)- 1.45, 4.30, 7.15, 10.00
కలశ (తెలుగు)- 9.45
స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 12.00, 03.15, 6.30, 09.45
స్క్రీన్-3 – డుంకీ (హిందీ) - 09.00, 12.20, 3.40, 7.00, 10.20
స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00 6.00, 9.00